
# పురుషులకు

పండువెన్నెల పిండారబోసినట్లుగా ఉంది. చల్లని మలయమారుతం వెన్నెలతో తీపికబుర్లాడుతూ వగలొలకపోస్తూ నడుస్తున్నట్లుగా మెల్లగా వీస్తోంది. ఆరుబయట నులక మంచంలో పడుకున్న చంద్రం అసహనంగా అటూ ఇటూ కదులుతున్నాడు. వీస్తోన్న చల్లనిగాలి అతని మేనును మెత్తగా స్పృశిస్తోన్నా అతనిలోని తాపం చల్లారడంలేదు. కళ్లు మూసినా తెరచినా అదే రూపం!..... అవే కళ్ళు!.... అవే చూపులు!.... ఆ చూపులే అతన్ని నిలదీస్తున్నాయి!.... ఆ కళ్ళే అతన్ని కోటి విధాలుగా ప్రశ్నిస్తున్నాయి!.... ఆరూపమే అతన్ని మంత్రముగ్ధుని చేస్తోంది!.... 'అలా' ఊహిస్తున్నాడే కాని అదంతా తన భ్రమేనేమో! భ్రమేనని ఎందుకనుకోవాలి? 'అలాగ' మాత్రం ఎందుకు కాకూడదు? ఏమో? ఎటూ తేల్చుకోలేని విషమ పరిస్థితి....సంకటస్థితి....ఏవేవో అల్లిబిల్లి ఆలోచనలు, ఊహలు అతని మనసును చిందరవందర చేయసాగాయి. అర్థరాత్రి అయ్యేందుకు ఇంకాకొద్ది నిమిషాల వ్యవధి మాత్రమే ఉంది. అయినా నిద్రాదేవత అతన్ని కరుణించడంలేదు.

దాదాపుగా ఐదారు సంవత్సరాల నుండి చంద్రం ఆమెను చూస్తూనేఉన్నాడు. చామన ఛాయ... వెడల్పాయిన గుండ్రని చక్రాల్లాంటి కళ్ళు... ఐదడుగుల ఐదంగుళాల ఎత్తు, ఎత్తుకు తగిన లావు. కందిరీగ నడుము, ...పిరుదులను తాకే నల్లని తుమ్మెదలాంటి పొడవయిన శిరోజాలు....అన్నింటికి మించి పొందికగా అమరినట్లుగా ఉన్నశరీర సౌష్టవం! ఆమె ముగ్గురు పిల్లలకి తల్లి అని అంటే ఎవరూ నమ్మరు. ఆ కళ్లల్లో ఓ వింత ఆకర్షణ. అతన్నే చూస్తూనే ఆకళ్లు తమాషాగా కొట్టుకుంటాయి!...ఆ పెదవులు సన్నగా నవ్వుతాయి! అతనేదో ఊహ లోకాల్లోకి తేలిపోతాడు. ఆ తీయని నవ్వే అతన్ని పులకింపజేస్తుంది! ఆ వింత చూపులే అతన్ని కవ్వింపజేస్తాయి!

ప్రతివేసవి సెలవుల్లో ఆ ఊరికి రావడం చంద్రానికి ఓ అలవాటుగా అయ్యింది. రాకుంటే అతని అమ్మమ్మ ఊర్కోదు....ఇది గతంలోని మాట!... కానీ ఇప్పుడు, రాకుంటే అతని మనసే ఊర్కోదు.... అందుకు కారణం 'ఆమె' ఆమెతో ఏర్పడిన పరిచయం! ఆ ఊరిలోకి అడుగిడగానే అతనిలో ఓ తీయని అనుభూతి! ఓ వింతయిన స్పందన! ఆ అనుభూతుల వెనక ప్రేరణ ఆమె అందమయిన రూపం! ప్రక్కింటి వాళ్లే కావడాన ఆ ఇంటివారికి ఈ ఇంటి వారికి మంచి సంబంధాలే ఉన్నాయి. రోజుకోసారి అయినా ఆమెతో మాట్లాడందే, ఆమెను చూడందే చంద్రానికి ఏమీ తోచదు. ఆమెను గురించిన ఆలోచనలే ప్రస్తుతం అతన్ని కలవర పరుస్తున్నాయి. ఆమె అంతరంగాన్ని ఎంతకూ అంచనావేయలేకపోతున్నాడతను! ఏదో శబ్దం కావడంతో ఆ వైపు దృష్టి సారించాడతను. మసక వెన్నెల... ఏదో ఆకారం ఆ ఇంటితలుపు తడుతోంది! కొద్దిసేపటి తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. ఓ చిన్న దీపాన్ని తీసుకొని బయటకు వచ్చింది 'ఆమె'. అంతులేని ఉత్సుకతతో గమనిస్తున్నాడు చంద్రం. వచ్చిన ఆ ఆకారం మెల్లిగా ముసుగు తొలగించింది. ఆ మసక వెలుతురులో, వచ్చిన ఆ అకారం ఓ స్త్రీది అని మాత్రం గుర్తించగలిగాడు అతను. వచ్చిన ఆ ఆగంతకురాలు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. 'ఆమె' మాత్రం బయట వరండాలో ఓ కుక్కి మంచం వేసుకొని పడుకుంది. చంద్రం మనసులో ఏదో తెలియని అలజడి... అశాంతి... ఏమిటీ ఇదంతా! జరుగుతున్నదేమిటో అతనికి అర్థం కావడంలేదు. తన కళ్లనే తను నమ్మలేని పరిస్థితి అది! చాలా వింతయిన సంఘటన! తను కలగనడం లేదుకదా! లేదు.... అక్షరాల వాస్తవంలోని పరిస్థితే అది! మరి 'ఆమె' ఈ పరిస్థితిని ఎలాభరించగల్గుతోంది? ఏమో! తనకు తెలియదు.... కొద్ది సేపటి వరకు తనను తాను సంభాళించుకోలేకపోయాడు అతను.

ఆమె ఆరుబయట వరండాలో! ఒంటరిగా! ... ఇద్దరి మధ్యా అడ్డుగా వుంది ఓ చిన్న ప్రహారీ గోడ మాత్రమే! ఆమె మీద మనసుపడిన చంద్రం మనసు ఆసమయంలో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అవుతోంది. అతనిలో దాగి ఉన్నకోరిక మెల్లిగా మేలుకుంది. ఆమె ప్రతి కదలిక అతనికి స్పష్టంగా కనిపిస్తోందిపుడు. మధ్య మధ్యలో ఆమె లేచి తమ ఇంటివయిపు చూస్తోంది! ఎందుకో? ఎవరికోసమో? తెలియదు.... కాదు.... కాదు... తనే సరిగ్గా అంచనావేయలేకపోతున్నాడు. "ఇంతరాత్రివేళ మా ఇంటి వైపుకు పదేపదే చూడాల్సిన పనేమిటీ ఆమెకు? తనకోసమా? నాకోసమే అయి ఉంటుంది...." అతని మనసుకు ఈ పరిస్థితి ఓ అగ్నిపరీక్షే అయ్యింది. ఆమె ప్రతి కదలిక అతనిలోని కోరికకు జీవంపోస్తున్నది.... ఉత్సాహాన్ని... ఉద్రేకాన్ని కల్గిస్తున్నది. కాని... ఏదో అదృశ్య శక్తి అతన్ని వెనక్కి లాగుతోంది.... మనసును అదుపులోపెట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడతను. ఎంతకూ ధైర్యం చేయలేని తన పిరికి తనాన్ని చేతకాని తనాన్ని మనసులోనే కసిదీరా తిట్టుకుంటున్నాడు. చేతికి చిక్కిన సువర్ణావకాశాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నానని ఓ ప్రక్క ఆత్మాభిరాముడు గేలి చేస్తున్నా



మరో ప్రక్క వివేచనా శక్తిని ఇస్తున్నాడు. ఆ రాత్రి చివరకు ఎలా నిద్రపట్టిందోకానీ మరునాడు అతను లేచే సరికి బారెడు ప్రొద్దెక్కింది.

"ఎంత మొద్దు నిద్దరరా బాబూ! తొమ్మిది గంటలు కావస్తున్నా లేచేది లేదు! ఏమిటో ఈ పట్నం పిల్లలు!" అంటూ ఉన్న అమ్మమ్మగారి మాటలు 'సుప్రభాత గీతంలా' వినిపించడంతో నిద్దురనుండి లేచాడు చంద్రం. త్వరత్వరగా పనులు ముగించుకుని అలా బజారుకి వెళ్దామనుకున్న అతను బ్రేకువేసిన బండిలా అలాగే గుమ్మంలో నిలబడిపోయాడు. ఎదురుగా ఆమె! తమ ఇంట్లోంచే వస్తోంది! ఏం పనో! బజారుకి వెళ్దామనుకున్న కోరికను తాత్కాలికంగా వాయిదావేసి, ముందు వరండాలో ఉన్న కుర్చీలో చతికిలబడి పోయాడు అతను. రోజూమాదిరిగానే ఆమె అతని వైపు చూసింది. కాని... ఈరోజు ఆచూపుల్లో ఏదో క్రొత్తదనం ఉన్నట్లుగా అనిపిస్తోంది! నిన్న మొన్నటి తీయనయిన చూపుల్లా ఉన్నాయా అవి! ఏదో లోపం ఉన్నట్లుగా ఉంది ఆ చూపుల్లో! లేదు... తనలోనే ఉంది లోపం! అందుకే ఆ చూపులు కవ్వించే బదులు గేలిచేస్తున్నట్లుగా ఉన్నాయి! తను భ్రమపడటం లేదుకదా! కాకపోతే ఏమిటి! ప్రతీ విషయాన్ని ఇలా భూతద్దంలో నుండి చూస్తే ఇలాగే ఉంటుంది కాబోలు! రాత్రి జరిగిన సంఘటన అతని మనసులో మెదిలింది. ఆమెకు కావలసిన వస్తువేదో ఇచ్చి "ఇపుడే వస్తాను నేను వచ్చేవరకు ఇంట్లోనే ఉండరా బాబూ!" అంటూ అమ్మమ్మ బజారుకి వెళ్లడంతో ఎగిరి గంతేసినంత పనిచేశాడు చంద్రం. ఇంట్లో ఇక ఎవ్వరూలఏరు. ఎదురుగా 'ఆమె', తను. ఆమెతో మాట్లాడేందుకు ఇదే తగిన సమయం... ఇదే అవకాశం!... మాట్లాడటమే కాదు.... వీలయితే తనలో ఇన్నాళ్లుగా దాగి ఉన్న కోరికను బయటపెట్టి ఎన్నడూ చవిచూడని ఆ 'అనుభవాన్ని' పొందాలి.... తనలోని ధైర్యాన్నంతా కూడగట్టుకొని ఆమెను సమీపించాడు అతను. ఓ అడుగు వెనక్కి వేసింది ఆమె. ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో తోచడంలేదతనికి. "ఏమి కావాలి" అన్నట్లుగా ప్రశ్నార్థకంగా అతని వైపు చూసింది ఆమె. ఆమెకళ్లలోకి సూటిగా చూడలేక తడబడుతున్నాడతను. "ఏదోచెప్పాలనుకుంటున్నావు కదూ!" '.............. ..............' ముందుగా ఆమె పెదవి విప్పింది.

"పలుకవేం? మగపిల్లవాడివి! మనసులోని విషయాన్ని ధైర్యంగా చెప్పలేవూ?"

"దాదాపు... దాదాపు ఐదారు సంవత్సరాల నుండి మీరు నన్ను చూస్తున్నారుకదా!"

"అవును..... చూస్తూనే వున్నాను...."

"నన్ను చూస్తుంటే మీకేమని పిస్తుంది?"

"అంటే?"

"........... ............ ..........."

"నేనేమి అనుకోను చంద్రం! కాస్త వివరంగా విషయమేమిటో చెప్పు."

"మిమ్మల్ని చూస్తోంటే నాలో ఓ తీయనయిన స్పందన... అనుభూతి... బహుశామీలో కూడా 'అలాంటి' అనుభూతే....... ....."

ఒకింతసేపు మౌనం తర్వాత....

"ఈ రాత్రికి మా ఇంటికి వస్తావా?"

"మీ ఇంటికా! ఇప్పుడు ఇక్కడ ఎవరున్నారని! మీరునేనూ తప్ప......" అంటూ ఆమెకి చేరువగా జరిగాడు అతను. మరికాస్త వెనుకకు జరిగింది ఆమె. ఆమె. చూపులో ఎంతటి శక్తి ఉందో కాని .... ఆమెకు మరింత చేరువగా అవుతున్న అతడు స్థాణువులా అక్కడే నిలబడిపోయాడు.


"ఇంతకీ మా ఇంటికి వస్తావా రావా?"

"మీ వారుంటారు కదా?"

"నీతో చాలావిషయాలు మాట్లాడాలి... రాత్రి ఏడు గంటలకు, ·గుర్తుంటుందిగా!" అంటూ వడివడిగా బయటికి నడిచింది ఆమె అతని జవాబుకోసం ఎదురు చూడకుండా!

* * * * * *

రాత్రి ఏడు ఎపుడవుతుందా అని ఏదురు చూస్తున్నాడు చంద్రం. ఇన్నాళ్ళుగా తను కన్న కలలు ఫలించబోయే తరుణం ఇంకా కొన్ని గంటల్లో రాబోతోంది.




ఆమె ముగ్ధమనోహర రూపం అతన్ని కవ్విస్తున్నట్లుగా అతని కళ్లల్లో దాగుడుమూతలాడుతోంది. ఆమె నన్నని చిరునవ్వు మనసును గిలిగింతలు పెడుతోంది! తీయని ఊహలన్నీ ఒక్కసారిగా అతని హృదయంలో చేరి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. క్షణం ఒక యుగంలా గడుస్తోందతనికి. ఎదురు చూస్తోన్న మధురక్షణాలు దగ్గరవుతోంటే అతనిలో ఓ విధమయిన ఉత్కంఠత...అపుడపుడే ఊరు సద్దుమణుగుతోంది...తూరుపున చంద్రుడు తొంగి తొంగి చూస్తున్నాడు...చల్లని పిల్లగాలి చందమామతో సరసాలాడుతూ మెల్లగా వీస్తోంది...అంతటి చల్లని రాత్రిలోసైతం అతని మేను వేడిసెగలు కక్కుతోంది... ఇంతలో మెల్లగా తలుపు తెరచిన శబ్దం... ఆమె గుమ్మంలో నిలుచుని ఉంది.

ఇలాంటి 'అనుభవాన్ని' ఇదివరలో ఎన్నడూ చవి చూడలేదతను...ఇదే అతని తొలి అనుభవం... అదురుతున్న గుండెతో ఆ ఇంట్లోకి వెళ్లేందుకు సన్నద్ధుడయ్యాడు అతను. ఏదో తప్పు చేస్తున్నవాడిలా అపుడే చంద్రుడు మెలిమెల్లగా మబ్బుల మాటున దాక్కుంటున్నాడు. మసక వెన్నెల...మత్తయిన వెన్నెల...అతని గుండె చేస్తోన్న చప్పుడు అతనికే వింతగా వినబడుతోందివుడు! తనను ఎవరూ గమనించడంలేదు అని నిర్ధారణ చేసుకొన్న తర్వాత పిల్లిలా ప్రహరీగోడ దూకి ఆ ఇంట్లోకి చేరాడు చంద్రం. అతనికి భయం భయంగా ఉంది. "ఒకవేళ ఈమె భర్త ఈ స్థితిలో నన్ను చూస్తే? అనుకోకుండా ఈ సమయంలోనే వస్తే" ఆ ఊహకే ఉలిక్కిపడ్డాడు అతను. అతని నుదిటిపై నన్నని స్వేదబిందువులు...అతను లోనికి ప్రవేశించగానే తలుపులు మూసింది ఆమె. భయంతో ముడుచుకుపోతున్నాడు అతను...అంతలోనే లేని ధైర్యం తెచ్చుకుంటున్నాడు..."నిండా మునిగాక ఇంకా చలేమిటి?" అన్నట్లుగా ఉంది అతని పరిస్థితి..అంతలోనే ధైర్యం...అంతలోనే భయం..

"అలా ముడుచుకు నిలబడ్డావేం ఇలారా! ఇక్కడ కూర్చో!" అంటూ ఎదురుగా ఉన్న మంచాన్ని చూపించింది.

"అక్కడ కూర్చోమంటోందేమిటి? తన ప్రక్కనే కూర్చోమనక!" మనసులోనే అనుకొని ఎదురుగా ఉన్న మంచంమీద కూర్చున్నాడు అతను.

"అలా తల వంచుకు కూర్చున్నావేమిటి? ఏమయినా మాట్లాడు" తిరిగి ఆమె అంది.

"పిల్లలు నిద్రపోయినట్లున్నారు!..

"అవును..."

"మీవారు ఎటు వెళ్లారు?" అతని మాటలు పొడిగా ఉన్నాయి.

"ఇంకెక్కడికి ఉంటుందీ...అక్కడికే అయి ఉంటుంది.."

"అక్కడికే అంటే...." అతని మనసులో రాత్రి జరిగిన సంఘటన మెదిలింది.

"మరి మీరెందుకలా ఊర్కొంటున్నారు?"

"ఊర్కొనక ఏం చేస్తాను? ఏమి చేయగలను?... కడుపు చించుకుంటే కాళ్లమీదే పడుతుంది...పరువు కాస్తా బజారు కెక్కుతుంది...ఆయన మగవాడు...ఏమి చేసినా ఎలా చేసినా చెల్లు బాటవుతుంది...పురుషాధిక్యత ఈ సమాజంలో అనాదిగా వస్తున్నదేగా!"

"రోజులు మారాయి! ఇప్పుడు! ఈ రోజుల్లో కూడా అలా అని ఊరుకుంటే సరిపోతోందా!"

"మోజు తీరిన తర్వాత ఏ మగాడయినా చేసేది అదేగా! వాసనలేని. పువ్వును ఎవరు ఇష్టపడతారు?"

"ఆలుమగల బంధానికి అర్థం ఇదేనా?" అలా ఆదర్శంగా మాట్లాడుతున్నాడేగాని అతని అంతరంగపు భావాల మాటేమిటి? ఆ భావాల రూపమేమిటి? అతని మనసు అదుపు తప్పుతోంది. సంభాషణను ప్రక్కదోవ పట్టించాలని,

"మీరు 'వాసనలేని పువ్వు' అని ఎవరన్నారు?" ఆమె కళ్లలోకి సూటిగా చూస్తున్న ఆ కళ్లల్లో కోరికల బుసలు...గుండెలో గూడుకట్టుకున్న బాధనంతా ఆప్తుడిగా అనిపించిన ఎదుటి వ్యక్తికి చెప్పి ఉపశమనం పొందుదామనుకున్న ఈ కళ్లలో నన్నని కన్నీటి పొరలు... ... ఆమెను తన కౌగిట బంధించి సుఖాల తీరాన్ని తాకాలన్న కోరికల ఆరాటం ఆ కళ్లలో!.... కష్టసుఖాల కలయికతో మేళవించిన జీవితానుభవాలతో ఏర్పడిన స్తబ్దత ఈ కళ్లలో! తన వ్యధనంతా ఓ ఆప్తునితో చెబుతున్నట్లుగా కన్నీటి పొరల మాటున ఆమె చెప్పుకుపోతోంది...అతని కోరిక నీరుగారిపోతోంది.

అప్పుడే ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి చేరుకుంటోన్న ఆమె భర్త...లోపల ఎవరో వ్యక్తి...తన భార్యతో మాట్లాడుతున్నాడు...అక్కడే స్థాణువులా నిలబడిపోయాడతను. అతని తనువును మనసును ఎవరో కొరడాతో కొట్టినట్లయ్యింది. వారి సంభాషణను బయట నిలుచునే వింటున్న అతని పిడికళ్లు బిగుసుకుంటున్నాయి. అయినా ఎందుకో నిగ్రహించుకొని వారి సంభాషణను జాగ్రత్తగా వినసాగాడు.

## బహుమతి పొందిన కథ

లోపల ఆమె మాట్లాడుతోంది... చంద్రం శ్రోతలా వింటున్నాడు.

"నా ప్రవర్తన, చూపులు... మాటలు... నీలో అలాంటి భావనలను కల్గిస్తే నన్ను క్షమించు చంద్రం! నా పట్ల నీ ఉద్దేశ్యం ఏమిటో నేను చూచాయగా మొదటే గ్రహించాను... మరీ ఇంత గాఢంగా నన్ను కోరుకుంటున్నావని ఈరోజే తెలుసుకున్నాను. కాని కొన్ని నిజాలు ఎప్పటికీ చేదుగానే ఉంటాయి. వయసులో నాకంటే చిన్నవాడివి....నీకిపుడే ఇవన్నీ అర్థం కావులే నీ పట్ల నాకెన్నడూ 'అలాంటి' భావన లేదు..నీపట్లే కాదు ఇంకెరి పట్లాకూడా అలాంటి భావనలు నాలో లేవు...ఉండకూడదు కూడా!...నా ప్రవర్తనే నీలో ఆశలు రేపితే నన్ను మనసారా క్షమించు! ఓ ఆత్మీయునిగా, ఓ స్నేహితునిగా నిన్ను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను చంద్రం! ఇంకా పైచదువులు చదవాల్సిన వాడివి...'ఇలాంటి' విషయాకు దూరంగా ఉండి నీ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకో!" అంటూ తలుపులు తెరిచింది.

ఎదుటి వ్యక్తిని సరిగ్గా అంచనా వేయలేని తన కుసంస్కారానికి లోలోనే సిగ్గుపడిపోతూ బయటకు నడిచాడు అతను. అతని వ్యక్తిత్వం ఆమె ముందు దోషిలా ముడుచుకుపోయింది. చెల్లికి. చెలికి తేడా తెలుసుకోలేని తన సంస్కారం గడ్డిపరక కంటే హీనమయ్యిందే! బయట మాటువేసి చాటుగా తన భార్య మాటలు వింటోన్న అతని మనసులో కోటి భావావేశాలు!....అతని కళ్లు తెరుచుకున్నాయి...ఇన్నాళ్లూ తాత్కాలిక సుఖాల కోసం, మమతాను రాగాలనుండి దూరమయి, అడ్డదారుల వెంట తిరుగుతూ అడ్డమయిన గడ్డి తింటూ ఉన్న తను గడ్డిపరకకంటే హీనం! ఆమె మహోన్నత వ్యక్తిత్వమనే వృక్షం నీడలో పెరుగుతున్న ఓ గడ్డిపరకలాంటి వాడు తను...ఆ క్షణంనుండే అతను పూర్తిగా మారిపోయాడు. హఠాత్తుగా మారిన తన భర్త ప్రవర్తన వెనుక రహస్యం ఏమిటో ఈనాటికీ ఆమెకు అంతు చిక్కలేదు..